సాక్షి
నల్లగొండ
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



అమ్మా.. భవానీ!
విజయదశమి అంటేనే భవానీ దీక్షలకు పెట్టింది పేరు. ఆడ, మగ తేడా లేకుండా భవానీ దీక్షలు చేపడుతున్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 588.30 అడుగులు
ఇన్‌ఫ్లో	: 67,289 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 50,867 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,029 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8,718 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 600

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 644.80 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 2,022.09 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,423 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 314.73 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 242.10 క్యూసెక్కులు

ఆర్టీసీ స్పెషల్ బాదుడు!

- దసరాకు స్పెషల్ బస్సుల్లో అదనపు చార్జీల వసూలు
- ఎలాంటి ప్రకటన లేకుండా చార్జీలు పెంచడంతో ప్రయాణికుల ఇక్కట్లు
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 'మహాలక్ష్మి' కొనసాగింపు
- 645 ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ



11వ తేదీ వరకు డిపోల వారీగా స్పెషల్ బస్సులు ఇలా..	
నల్లగొండ	80
నార్కట్‌పల్లి	37
మిర్యాలగూడ	84
కోదాడ	45
సూర్యాపేట	87
దేవరకొండ	62
యాదగిరిగుట్ట	59
మొత్తం	454

13నుంచి 16వ తేదీ తిరుగు ప్రయాణంలో..	
నల్లగొండ	30
నార్కట్‌పల్లి	12
మిర్యాలగూడ	34
కోదాడ	14
సూర్యాపేట	37
దేవరకొండ	32
యాదగిరిగుట్ట	32
మొత్తం	191

ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో చార్జీల పెంపు ఇలా (రూ.లలో)

రూట్	పాత చార్జి	పెంచిన చార్జి
హైదరాబాద్ – సూర్యాపేట	200	240
హైదరాబాద్ – కోదాడ (వయా మిర్యాలగూడ)	290	350
హైదరాబాద్ – కోదాడ (వయా సూర్యాపేట)	280	340
హైదరాబాద్ – నల్లగొండ	160	190
హైదరాబాద్ – నల్లగొండ (డీలక్స్)	180	210

నల్లగొండ రూరల్, భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులపై స్పెషల్ బాదుడు మొదలు పెట్టింది. దసరా పండుగ సందర్భంగా నడిపే ప్రత్యేక సర్వీసులకు చార్జీలను పెంచి ప్రయాణికులపై భారం మోపింది. ఈ పెంచిన చార్జీల విషయమై ప్రయాణికులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో కాస్త ఇబ్బంది పడ్డారు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత నుంచి నడిచిన బస్సులకు ఈ పెంచిన చార్జీలను వసూలు చేశారు. ఈ నిర్ణయంతో పండుగకు సొంతూళ్లకు వచ్చే పేదలపై భారం పడుతుంది.

హైదరాబాద్ నుంచే..!

దసరా పండుగ రద్దీ ప్రారంభం కావడంతో ఆర్టీసీ మొత్తం 645 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించింది. పండుగ ముందు ఈనెల 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 454 బస్సులు నడుపుతు నడుపుతోంది. పండుగ తర్వాత తిరుగు ప్రయాణానికి 16వ తేదీ వరకు 191 బస్సులను నడుపుతోంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని స్పెషల్ బస్సుల్లో ఆర్టీసీ చార్జీల పెంపు చేపట్టింది. డిపోల నుంచి వెళ్లే సమయంలో చార్జీలను యథావిధిగానే వసూలు చేస్తున్నారు. తిరిగి హైదరాబాద్ నుంచి వచ్చే సమయంలో రద్దీ అధికంగా ఉన్నందున 25 శాతం ఎక్కువగా వసూలు చేస్తున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో మహాలక్ష్మి టికెట్ అమలు చేస్తున్నారు.

కండక్టర్లతో ప్రయాణికుల వాదన

మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే ఈ సదుపాయం ఉండగా.. ఆపై నడిచే డీలక్స్, సూపర్ లగ్జరీ తదితర బస్సుల్లో మహిళలకూ చార్జీలు వసూలు చేస్తారు. శనివారం ఉదయం 10గంటల తర్వాత నుంచి నడిచే బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి ప్రకటన లేకుండా చార్జీలను పెంచడం, అదీ హైదరాబాద్ నుంచి మాత్రమే కావడంతో ప్రయాణికులు కండక్టర్లతో వాదనకు సైతం దిగుతున్నట్లు తెలుస్తోంది.

ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్య పెంచుతాం..



ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్య పెంచుతాం. సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు 645 బస్సులను నడుపుతున్నాం. పండుగకు హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాకు ఎక్కువగా వస్తుంటారు. తిరిగి మళ్లీ హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా బస్సులను నడుపుతాం. కేవలం ప్రత్యేక బస్‌ల్లో ప్రయాణించే పురుషులపైనే 25 శాతం అదనపు చార్జి వసూలు చేస్తాం. మహాలక్ష్మి పథకాన్ని యథావిధిగా కొనసాగిస్తాం.

– రాజశేఖర్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నల్లగొండ

న్యూస్‌రీల్

నిడమనూరు మార్కెట్ చైర్మన్‌గా అంకతి సత్యం



అంకతి సత్యం, మార్కెట్ చైర్మన్



బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్

హాలియా, త్రిపురారం : నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ శనివారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని పార్వతీపురం గ్రామానికి చెందిన అంకతి సత్యం (సత్యనారాయణ) నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా త్రిపురారం మండలంలోని దుగ్గెపల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులుగా మన్నెం శంకర్, పాల్వాయి చంద్రశేఖర్‌రెడ్డి, మెండె వెంకటేశ్వర్లు, వంగాల అనిల్ కుమార్‌రెడ్డి, సపావట్ శ్రీను, ఎండీ.యాకూబ్ అలీ, పొలగాని పరుశురాం, అనుముల మంజుల, కురపాటి సైదులు, గంగుల గురువయ్య, రేపాల మధుసూదన్, బి.అశోక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. చైర్మన్‌గా నియమితులైన సత్యం తండ్రి అంకతి వెంకటయ్య 1993లో నిడమనూరు మార్కెట్ చైర్మన్‌గా పనిచేశారు. అంకతి సత్యం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నిడమనూరు మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

చెకుముకితో శాస్త్రీయ దృక్పథం పెంపు

నల్లగొండ టౌన్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు చెకుముకి పరీక్షలు ఉపయోగపడతాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకట రమణారెడ్డి అన్నారు. నల్లగొండలో శనివారం గుత్తికొండ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెకుముకి మ్యాగజైన్‌లో చందాదారులను అధిక సంఖ్యలో చేర్పించాలని, జేవీవీ సభ్యత్వ నమోదు చేయించాలని సూచించారు. జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులను చెకుముకి పరీక్షలు రాసేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విమల, ఉస్మాన్ అలీ, వంగూరి శ్రీనివాస్, కోటిరెడ్డి, మధుసూదన్, భద్రయ్య, నగేష్, సుధాకర్, సైదులు, శంకర్, గౌతమి, కోకిల, స్వప్న, శశిరేఖ, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో ప్రత్యేక ప్రచార ఉద్యమం 4.0

నల్లగొండ : భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)లో ఈ నెల 31వ తేదీ వరకు స్వచ్ఛత కోసం 'ప్రత్యేక ప్రచార ఉద్యమం 4.0' నిర్వహించనున్నట్లు ఎఫ్‌సీఐ నల్లగొండ ఇన్‌చార్జి డివిజన్ మేనేజర్ హీరాసింగ్‌రావత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రచార ఉద్యమం సెప్టెంబర్ 16న ప్రారంభించిన అదేనెల 30న పూర్తి చేశామని, తిగిరి ఈనెల 2న ప్రారంభించి 31వరకు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

ఐటీఐలో కొత్త కోర్సులకు అడ్మిషన్లు

నల్లగొండ : 2024–25 విద్యా సంవత్సరంలో ఐటీఐలో కొత్తగా ప్రారంభించిన కోర్సులకు 6వ దశ వాక్ ఇన్ అడ్మిషన్లు ఈ నెల 9వరకు జరుగుతాయని ప్రభుత్వ ఐటీఐ (ఓల్డ్) ప్రిన్సిపాల్ ఎ.నర్సింహాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో వారి మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 9వ తేదీలోగా వారి హాజరు కావాలని తెలిపారు.



నూతనకల్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌లో ముసలం

తుంగతుర్తిలో మొదలైన వర్గపోరు

- ఎమ్మెల్యే సామేల్ వర్సెస్ మాజీ మంత్రి ఆర్డీఆర్ అనుచరులు
- తమను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదంటున్న సీనియర్లు
- బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపణ
- అర్వపల్లిలో శనివారం సీనియర్ల సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు

సాక్షిప్రతినిధి, నల్లగొండ: తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా ముసలం ప్రారంభమైంది. పార్టీలో పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్‌గా చీలికలు వస్తున్నాయి. ఈ నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా ఉంది. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఇక్కడ మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా, ఒక్కసారి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో నియోజకవర్గాల పునఃర్విభజనలో భాగంగా ఎస్సీ రిజర్వుడ్ కావడంతో అప్పటి నుంచి పార్టీ అభ్యర్థులు ఓటమి పాలవుతున్నారు.

కొన్నిరోజులుగా వర్గపోరు..

2023లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వచ్చిన మందుల సామేల్‌కు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చింది. సామేల్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. ప్రారంభంలో పార్టీలో అందరూ సమన్వయంతో ఉన్నా గత కొద్ది రోజులుగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అనుచరులు, ఎమ్మెల్యే మందుల సామేల్ మధ్య వర్గపోరు రోజు రోజుకూ తీవ్రమవుతోంది. పార్టీలో సీనియర్లను కాదని పాత బీఆర్‌ఎస్ నాయకులకు ఎమ్మెల్యే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే లేకున్నా పార్టీ కోసం కష్టపడి ఆర్థికంగా నష్ట పోయామని, కేసుల పాలయ్యామని కొందరు వాపోతున్నారు. తీరా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా తమకు ప్రాధాన్యత లేదని ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థికి డబ్బులు ఎదురు పెట్టి గెలిపించామని చెబుతున్నారు. గెలిచిన కొద్ది రోజులకే ఎమ్మెల్యే తమను దూరం పెడుతూ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడుతున్నారు. 30 సంవత్సరాలుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కాపాడిన మాజీ మంత్రి దామోదరరెడ్డి ఫొటోలు కూడా కనీసం ఫ్లెక్సీలలో పెట్టనీవడం లేదని వాపోతున్నారు.

ప్రజా దర్బార్ నిర్వహిస్తాం..

తుంగతుర్తి నియోజకవర్గంలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి ఇద్దరూ కలిసి కార్యకర్తల శుభకార్యాలకు, ఇతర వేడుకలకు హాజరవుతున్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుక రావాలని, అవసరమైతే ప్రజా దర్బార్ నిర్వహిస్తామని రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ప్రకటించారు.

సమావేశాలు రద్దు..

సీనియర్ కాంగ్రెస్ నాయకులంతా తమకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పుకోవడానికి పార్లమెంట్ ఎన్నికల ముందు మే 15న అర్వపల్లి మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ జోక్యం చేసుకొని పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయొద్దని రద్దు చేయించారు. మరలా కొద్ది రోజులు సమన్వయంతో ఉన్నా ఈ మధ్య కాలంలో అన్ని మండలాల్లో రెండు గ్రూపులుగా చీలిపోతున్నారు. శనివారం అర్వపల్లి మండల కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేయగా పోలీసులు ఈ సమావేశాన్ని అడ్డుకొని ముందస్తుగా పార్టీ నాయకులను అరెస్టు చేసి ఇతర మండలాల పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టు అయిన నాయకులు పత్రికా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత లేదని, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఓటమి కోసం పనిచేసి ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బతికించుకుంటామని, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

సమైక్యత శిబిరానికి వలంటీర్ల ఎంపిక



వలంటీర్ల ఎంపికను ప్రారంభిస్తున్న మద్దిలేటి

నల్లగొండ రూరల్ : జాతీయ సమైక్యత శిబిరానికి హాజరయ్యే ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను శనివారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంపిక చేశారు. మహారాష్ట్రలోని జనగాం విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, భాషా పరిజ్ఞానంపై ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త మద్దిలేటి తెలిపారు. ఈ ఎంపికలో హైదరాబాద్ రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ, నర్సింహ, సంజయ్ పాల్గొన్నారు.

వెంకటస్వామికి నివాళి

నల్లగొండ క్రైం : పట్టణంలోని పోలీస్ జిల్లా కార్యాలయంలో శనివారం దివంగత మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శరత్ చంద్రపవార్ పాల్గొని వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

1,424 మంది అభ్యర్థులు హాజరు



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

- ముగిసిన డీఎస్సీ–2024 సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- 101 మంది గైర్హాజరు

నల్లగొండ : డీఎస్సీ–2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ముగిసింది. 1,424 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఈ నెల 2 నుంచి నల్లగొండలోని డైట్ కాలేజీలో సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో 2024 డీఎస్సీలో 605 పోస్టులు ఉన్నాయి. మొత్తం 1,525 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయాలని డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్సీ) నుంచి జిల్లా విద్యా శాఖకు జాబితా అందింది. స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీలు మినహా మిగిలిన పోస్టులకు సంబంధించి 1:3 ప్రకారం అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన సర్టిఫికెట్ల పరిశీలన 5వ తేదీ శనివారంతో ముగిసింది. పరిశీలన కోసం 30 మందిని సీనియర్ హెడ్మాస్టర్లు నియమించారు. వారితోపాటు సిబ్బందిని, ఇతర ఉపాధ్యాయులను అందుబాటులోఉంచారు. వారంతా ఉదయం నుంచిరాత్రి వరకు ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా సర్టిపికెట్లు పరిశీలించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా ఉపాధ్యాయ సంఘాలు పలు సూచనలు చేశాయి.

కొందరి సర్టిఫికెట్ల తిరస్కరణ

మొత్తం 1,525 మంది అభ్యర్థులను సరిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచారు. వారిలో ఈ నెల 2వ తేదీన 212 మంది, 3న 548 మంది, 4న 497 మంది, 5న 167 మంది సర్టిఫికెట్ల ఈ నాలుగు రోజుల్లో మొత్తం 1,424 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. 101 మంది గైర్హాజరయ్యారు. కొందరి సర్టిఫికెట్లు తిరస్కరణకు గురయ్యాయి. అయితే హాజరుకాని వారు ఏ కారణం చేత రాలేదని.. ఏ కారణాలతో తిరస్కరణకు గురయ్యారనే వివరాలను విద్యా శాఖ అధికారులు సేకరిస్తున్నారు.

దేశానికే రోల్ మోడల్‌గా నూతన రెవెన్యూ చట్టం



నెల్లికల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన జానారెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో దొరల కుటుంబమే బాగుపడింది
- తిరుమలగిరి (సాగర్) మండలం నెల్లికల్‌లో రైతులతో ముఖాముఖి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : దేశానికే రోల్ మోడల్‌గా ఉండేలా నూతన రెవెన్యూ (ఆర్‌ఓఆర్) చట్టాన్ని అతికొద్ది రోజుల్లోనే ప్రజల ముందుకు తీసుకురానున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నూతన ఆర్‌ఓఆర్ చట్టానికి సంబంధించి ప్రధాన ప్రతిపక్షం తమ విలువైన సలహాలు, సూచనలు ఇస్తే అవి మంచివైతే ఆ చట్టంలో చేర్చుతామన్నారు. తిరుమలగిరి (సాగర్) మండలంలోని నెల్లికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అధికారులు, రైతులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. నూతన ఆర్‌ఓఆర్ చట్టం రూపకల్పనలో భాగంగా తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు వివరించారు. ఇక్కడ వచ్చిన సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించాలనే దానిపై అధ్యయనం చేసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే తరహాలో వ్యవహరించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 2020 రెవెన్యూ చట్టం, ధరణి పోర్టల్ వల్ల దొరల కుటుంబం మాత్రమే బాగుపడిందే తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రత్యేకించి తిరుమలగిరి(సాగర్) మండలంలో కొంతమంది కబ్జాలో ఉన్నప్పటికీ పట్టాలు లేవని, పట్టాలు ఉన్నవారికి భూములు లేవన్నారు. ఈ సర్వే పూర్తయిన తరువాత అన్ని సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటి వరకు 4300 ఎకరాల్లో సర్వే చేస్తే 1300 ఎకరాలు బోగస్ పట్టాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారన్నారు. రానున్న రెండు నెలల్లో సర్వేను పూర్తిచేసి తిరుమలగిరి సాగర్ మండలంలో నాలుగు వేల ఎకరాలకు సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలో బహిరంగ సభను ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చేతులమీదుగా పంపిణీ చేస్తామని తెలిపారు.

సాగర్‌కు ఐదు వేల ఇళ్లు..

ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఈనెల చివరి వరకు మొదటి విడతగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు 3500 చొప్పున ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. మాజీ మంత్రి జానారెడ్డి కోరిక మేరకు నాగార్జునసాగర్ నియోజకవర్గానికి ఐదు వేల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల హక్కు పత్రాలు అందరికీ అందేలా చూడాలన్నారు. బ్యాంకుల్లో ఉన్న వాటిని విడిపించాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ఎనిమిది గ్రామాల్లో సర్వే : కలెక్టర్

కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో భూ సమస్య తీవ్రంగా ఉన్న ఎనిమిది రెవెన్యూ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మొదటి విడతలో ఎంపిక చేసి సర్వే చేస్తున్నట్లు మంత్రికి వివరించారు. మండల వ్యాప్తంగా 16,602 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉందని, ఇప్పటి వరకు 9200 ఎకరాల్లో సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో 3,472 ఎకరాలు ఫారెస్టు, 3,634 ఎకరాలు ఈపీ ల్యాండ్స్ ఉన్నట్లు వెల్లడించారు. సర్వేపై రైతులకు ఏవైనా అభ్యంతరాలుంటే డీఐ, తహసీల్దార్ల స్థాయిలో మరోసారి పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఒక్క నెల్లికల్ రెవెన్యూ పరిధిలోనే ధరణి రికార్డుల్లో 622 ఎకరాలు అదనంగా ఉన్నట్లు వెల్లడించారు.

గోడు వెల్లబోసుకున్న రైతులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తమ విలువైన భూములను పోగొట్టుకున్నామని.. 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసినా.. ధరణితో తమ భూములు రికార్డుల్లో లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. పేద రైతు చనిపోతే రైతు బీమా కూడా అందడం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని వేడుకున్నారు. రెవెన్యూ, ఫారెస్టు బౌండరీల పేరుతో అధికారులు తాము సాగుచేసిన పంటలను ధ్వంసం చేసి కేసులు నమోదు చేస్తున్నారని వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



టీఎన్‌జీవో భవన్‌లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఉద్యోగులు

- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్
- నల్లగొండలో బతుకమ్మ సంబరాలు

నల్లగొండ టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఉద్యోగులకు దసరా పండుగ కానుకగా ప్రభుత్వం మూడు డీఏలు ఇస్తుందని ఆశించినా నిరాశ మిగిల్చిందన్నారు. 310 జీవోపై సబ్ కమిటీ ఏర్పాటు చేసి నేటికీ ఎలాంటి పరిష్కారం చూపలేదన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కొందరు జిల్లా కలెక్టర్లు ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యాలయ ఆవరణలో బతుకమ్మ సంబరాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, కార్యదర్శి శేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.నర్సింహాచారి, జయరాజు, దశరథ, వంగూరి విజయకృష్ణ, ఆకుల లక్ష్మయ్య, డీఐ రాజు, పంతులు శ్రీనివాస్, వంగూరు భాస్కర్, సంధ్య, మాధవి, లక్ష్మి, వెంకటరమణ పాల్గొన్నారు.

దూది రైతుల దుఃఖం

- సీసీఐ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7500
- గ్రామాల్లో వ్యాపారులు చెల్లిస్తున్నది రూ.5300
- వర్షానికి తడిసి రంగు మారిందనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు
- ఇంకా ప్రారంభంకాని సీసీఐ కేంద్రాలు
- అయోమయంలో రైతులు



ట్రాక్టర్‌లో పత్తిని మిల్లుకు తీసుకెళ్తున్న రైతు

రామన్నపేట: ఇటీవల కురిసిన వర్షాలు పత్తి సాగు చేసిన రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పత్తి తీసే సమయంలో వర్షాలు కురుస్తుండడంతో పగిలిన పత్తి తడిసి రంగు మారుతుండగా మరోవైపు పగిలిన ఊడల్లోకి వర్షపునీరు చేరి కుళ్లిపోతుంది. రంగు మారిందనే సాకుతో వ్యాపారులు గణనీయంగా పత్తి ధరను తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో రైతు ఒక్కో క్వింటాల్‌కు రూ.1500 నుంచి రూ.2000 వరకు నష్టపోతున్నాడు. సరైన దిగుబడి లేక, పంట చేతికి వచ్చే సమయంలో ధర పడిపోవడం వంటి కారణాలతో గత నాలుగైదేళ్లుగా పత్తి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాదైనా కాలం కలిసొచ్చి కష్టాలు గట్టెక్కుతాయనే ఆశతో ఉన్న రైతులను వరుసగా కురుస్తున్న వర్షాలు కలవరపెడుతున్నాయి.

1,00,514 ఎకరాల్లో పత్తిసాగు..

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ వానాకాలంలో 1,00,514 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 2,263 ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ యేడు పత్తిచేలు మెరుగ్గా ఉండి దిగుబడి పెరిగే అవకాశం ఉంది. 5లక్షల నుంచి 6.5లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.7500 మద్దతు ధర ప్రకటించింది. అయితే జిల్లాలో ఇప్పటి వరకు సీసీఐ వారు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దీంతో వ్యాపారులు రైతుల ఇళ్ల వద్దకు వచ్చి గత నెలలో క్వింటాల్‌కు రూ.7000 నుంచి రూ.7200 చెల్లించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి తడిసి రంగు మారిందనే సాకుతో వ్యాపారులు రూ.5000 నుంచి రూ.5300 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో పలువురు రైతులు చేసేదేమీలేక నేరుగా పత్తి మిల్లుల వద్దకు తీసుకెళ్లి రూ.5800 నుంచి రూ.6000 వరకు ధర పొందుతున్నారు. దీంతో రైతులు క్వింటాల్‌కు రూ.1500 నుంచి రూ.2000 వరకు నష్టపోవాల్సి వస్తోంది.

ఎకరానికి రూ.40వేల వరకు ఖర్చు..

సీజన్ ప్రారంభంలో వర్షాలు కొంత ఆలస్యంగా కురిసినా జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలు పత్తి రైతులకు ఊరటనిచ్చాయి. అదేవిధంగా సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన వానలు పత్తి చేలకు అదునుగా ఉపయోగపడ్డాయి. అనంతరం కురిసిన వర్షాలతో చేలలో నీరు నిల్వఉండి తేమ అధికమైంది. దీంతో పంటకు వేరుకుళ్లు, చీడపీడలు ఆశించాయి. అయినా రైతులు సరైన సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించి సమస్యను అధిగమించారు. దీంతో రైతు ఒక్క ఎకరాకు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చు చేశారు.

రూ.5750కు కొనుగోలు చేశారు



నేను మూడెకరాల్లో పత్తి సాగు చేశాను. ఇప్పటివరకు ఏడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొదటి మూడు క్వింటాళ్లను రూ.7200కు అమ్మాను. ఇటీవల తీసిన పత్తి వర్షాలకు తడిసిందని గ్రామంలో చాలా తక్కువ ధరకు అడిగారు. దీంతో ఆటోలో చిట్యాల మండలంలోని పత్తి మిల్లుకు తీసుకెళ్లాను. 17శాతం తేమ వచ్చింది. అయినా వర్షంలో తడిసిందని రూ.5750కు కొనుగోలు చేశారు.

– నకిరేకంటి నరేష్, రైతు, వెల్లంకి

మద్దతు ధర రూ.10వేలుగా నిర్ణయించాలి



సాగు ఖర్చులు ప్రతీ ఏడాది పెరుగుతున్నాయి. పత్తి రైతులు నాలుగైదేళ్లుగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు, గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారు. పెరిగిన సాగు ఖర్చులతో పోలిస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చాలా తక్కువ. తడిసిన పత్తిని కూడా మద్దతు ధరకే కొనే విధంగా చర్యలు తీసుకోవాలి. కనీస మద్దతు ధర రూ.10వేలుగా నిర్ణయించాలి.

– జనార్దన్‌రెడ్డి, రైతు, దుబ్బాక

క్లుప్తంగా

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు

అనంతగిరి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్ గ్రామానికి చెందిన బత్తుల కోటేశ్వరరావు, చల్లా బాలాజీ(27) శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై కోదాడ నుంచి ఇంటికి వెళ్తున్నారు. బత్తుల కోటేశ్వరావు ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండగా.. అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని సనా కాలేజీ సమీపంలో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న బాలాజీ తలకు, ఇతర శరీరభాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బత్తుల కోటేశ్వరరావుకు గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి బావ బత్తుల కృష్ణ ఇచ్చి న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

మంత్రి చిన్నమ్మ కోమటిరెడ్డి లక్ష్మమ్మ మృతి



పాడె మోస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం బి. వెల్లంల గ్రామానికి చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చిన్నమ్మ కోమటిరెడ్డి లక్ష్మమ్మ(85) అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. లక్ష్మమ్మ భౌతికకాయానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవాలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. వారి వెంట మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, గుత్తా వెంకట్‌రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

సాగర్ ఎడమ కాల్వలో అంగన్‌వాడీ టీచర్ గల్లంతు



అనూష (ఫైల్)



ప్రాణాలతో బయటపడిన అనూష భర్త సైదులు

వేములపల్లి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి సాగర్ ఎడమ కాల్వలోకి దూసుకెళ్లగా.. అంగన్‌వాడీ టీచర్ గల్లంతయ్యింది. ఆమె భర్త ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన వేములపల్లి మండలం రావులపెంట గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ ఇటీవల పదోన్నతిపై వెళ్లగా ఆమనగల్లు గ్రామ పరిధిలోని రావువారిగూడేనికి అంగన్‌వాడీ టీచర్ పేరబోయిన అనూష(35)కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. శనివారం ఉదయం తన భర్త సైదులుతో కలిసి ద్విచక్ర వాహనంపై అనూష కామేపల్లి గ్రామానికి బయల్దేరి వెళ్లింది. సాయంత్రం తన భర్తతో పాటు ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళ్తుండగా.. రావులపెంట గ్రామ శివారులో సాగర్ ఎడమకాల్వ బ్రిడ్జి వద్ద ఒక్కసారిగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి సాగర్ ఎడమ కాల్వలోకి దూసుకెళ్లింది. సైదులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరగా అనూష కాల్వలో గల్లంతయ్యింది. సమాచారం అందుకున్న వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి గల్లంతైన అనూష కోసం కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టారు. కాగా అనూషకు కుమార్తె రాజాకుమారి, కుమారుడు స్వరణ్‌రాజ్ ఉన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిపై కేసు

- 128 గంజాయి మొక్కలు స్వాధీనం

గుర్రంపోడు: ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం గుర్రంపోడు పోలీస్ స్టేషన్‌లో కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ విలేకరులకు వెల్లడించారు. గుర్రంపోడు మండలంలోని బుడ్డరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సింగం ముత్యాలు తన పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు శనివారం మండల వ్యవసాయాధికారి సమక్షంలో దాడి చేసి 128 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సీఐ ధనుంజయ, ఎస్ఐలు వేమిరెడ్డి నారాయణరెడ్డి, రామ్మూర్తి, కానిస్టేబుళ్లు నరసింహ, నాగరాజును నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. యువకుడు మృతి



హరిగణేష్ (ఫైల్)

ఆలేరురూరల్: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆలేరు బైపాస్ రోడ్డులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట మండలం సోమారం గ్రామానికి చెందిన తమ్మడి హరిగణేష్(30) తల్లిదండ్రులతో కలిసి మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని బోడుప్పల్‌లో నివాసముంటున్నాడు. హరిగణేష్ డీజే నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన నానమ్మ నెల మాసికం కోసం కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. శనివారం ఉదయం అతడు బైక్‌పై తిరిగి బోడుప్పల్‌కు వెళ్తూ ఆలేరు పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో బైపాస్ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హరిగణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజనీకర్ తెలిపారు.

కారు డోర్ తగిలి వ్యక్తి మృతి

చౌటుప్పల్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి తన ముందు ఆగిన కారు డ్రైవర్ చేసిన చిన్న పొరపాటుతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన తుర్కపల్లి శంకరయ్య(65) శనివారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్‌కు వచ్చాడు. పని పూర్తయిన తర్వాత సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చౌటుప్పల్ పట్టణ శివారులోని వేబ్రిడ్జి ఎదురుగా హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై విజయవాడ వైపు వెళ్తున్న కారు ఆగి ఉంది. శంకరయ్య కారు వద్దకు చేరుకున్న సమయంలో కారు డ్రైవర్ ఒక్కసారిగా డోర్ తెరిచాడు. దీంతో కారు డోర్ ద్విచక్ర వాహనానికి బలంగా తగిలి శంకరయ్య రోడ్డుపై ఎగిరిపడ్డాడు. బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

బొలేరో వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం

- ఒకరు దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు

మిర్యాలగూడ: దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామంలో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వాడపల్లి ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం చెరువుతండాకు చెందిన బానావత్ సిపాయి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కాంట్రాక్టుగా బొలేరో వాహనాన్ని నడుపుతున్నాడు. శనివారం విధులు ముగిసిన అనంతరం అతడు దామరచర్లకు చేరుకున్నాడు. అదే గ్రామానికి చెందిన బాణావత్ సాయి(18), బానావత్ బాబును బొలేరో వాహనంలో ఎక్కించుకుని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి గుండా రాళ్లవాగు తండా దాబా వైపు వెళ్తుండగా బొత్తలపాలెం గ్రామ పరిధిలోకి రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టి అవతలి వైపు రోడ్డులోకి దూసుకెళ్లింది. అదే సమయంలో గుంటూరు వైపు వెళ్తున్న డీసీఎం బొలేరో ఢీకొట్టడంతో రెండు వాహనాలు బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో బాణావత్ సాయి అక్కడికక్కడే మృతిచెందగా.. నితిన్‌బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. డ్రైవర్ సిపాయికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. మృతుడు సాయి, నితిన్‌బాబు వరుసకు సోదరులు. ఇరువురు నల్లగొండలోని గౌతమి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఘటనా స్థలంలో రహదారికి ఇరువైపులా వాహనాలు బోల్తా పడి ఉండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడగా.. పోలీసులు వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

విషమంగానే నాగరాజు ఆరోగ్య పరిస్థితి

శాలిగౌరారం: అక్రమ కేసు బనాయించి పోలీసులు కొట్టారని మనస్తాపానికి గురై చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన శనిగ నాగరాజు ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు అతడి కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. నాగరాజు ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలోని చికిత్స పొందుతున్నాడు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని బాలాజీ క్రషర్ మిల్లులో నాగరాజు టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నాగరాజు డీజిల్ దొంగతనానికి పాల్పడ్డాడని క్రషర్ మిల్లు యజమాని వెంకన్న తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తాను చేయని తప్పుకు స్థానిక ఎస్ఐ వి. సురేష్ తనను తీవ్రంగా కొట్టాడని ఆరోపిస్తూ శుక్రవారం నాగరాజు తన పొలం వద్ద చెట్టుకు ఉరితాడు బిగించుకుని సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్యాయత్నం చేశాడు.

చేపల వేటకు వెళ్లి మృతి

నార్కట్‌పల్లి: చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్లి అందులో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం తొండల్‌వాయి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండల్‌వాయి గ్రామానికి చెందిన చిల్ల సైదులు(54) గ్రామ పరిధిలోని చెరువులో చేపలు పట్టడానికి వల తీసుకోని వెళ్లాడు. చెరువు కట్ట నుంచి లోపలికి వెళ్లి వల విసురుతుండగా.. వల కాళ్లకు చుట్టుకుని చెరువులో పడిపోయాడు. తలకు తీవ్రగాయమైంది. చెరువు కట్టపై కాపలా ఉంటున్న వ్యక్తి గమనించి చుట్టుపక్కల రైతులను పిలిపించి చెరువులో నుంచి సైదులును బయటికి తీసేసరికి అప్పటికే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు



రవీందర్‌గౌడ్ (ఫైల్)

మద్దిరాల: కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామ శివారులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బత్తిని రవీందర్‌గౌడ్(55)తో పాటు సత్తయ్య, రమేష్, రామోజీ కలిసి హైదరాబాద్‌లో కొత్తగా తీసుకున్న బోర్ బండిని తీసుకురావడానికి కారులో వెళ్తుడంగా.. మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామ శివారులో 365వ నంబర్ జాతీయ రహదారి కారు అదుపుతప్పి సమీపంలోని కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బత్తిని రవీందర్‌గౌడ్ అక్కడిక్కడే మృతిచెందగా.. రమేష్, సత్తయ్య, రామోజీకి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ కల్వల శ్రీనివాస్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడు లచ్చిరాంకు అరుదైన గౌరవం

- నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాలో జీవితకాల సభ్యత్వం



ఉదావత్ లచ్చిరాం

మర్రిగూడ: మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంకు అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఆయన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం రాష్ట్రం నుంచి నేషనల్ జ్యూరీకి ఎంపికైన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా 152 మంది ఉపాధ్యాయులు నేషనల్ జ్యూరీకి ఎంపికయ్యారు. ఇలా ఎంపికైన ఉపాధ్యాయులకు నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా రూ.10వేల విలువగల పుస్తకాలను బహుమతిగా అందించడంతో పాటు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాలో జీవితకాల సభ్యత్వాన్ని కల్పించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు లచ్చిరాం తెలిపారు. తనకు నేషనల్ ట్రస్ట్ బుక్ ఆఫ్ ఇండియా వారు అందించే పుస్తకాలను పాఠశాల గ్రంథాలయంలో విద్యార్థులకు అందుబాటులో ఉంచుతానని ఆయన పేర్కొన్నారు. ఆయనకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

భక్తి మార్గం

అమ్మా.. భవానీ!

- దేవీ నవరాత్రుల్లో దుర్గమ్మ దీక్ష చేపడుతున్న మహిళలు, యువతులు
- కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకం
- ఏటేటా పెరుగుతున్న భవానీ మాతలు



మిర్యాలగూడ టౌన్, రామగిరి(నల్లగొండ) : విజయదశమి పండుగ అంటే భవానీ దీక్షలకు పెట్టింది పేరు. ఆడ, మగ అని తేడా లేకుండా అందరూ భవానీ దీక్షలు తీసుకుంటారు. చిన్న వయసు నుంచి వృద్ధుల వరకు అందరూ దీక్షలు చేపడతారు. ఒకప్పుడు పురుషులు ఎక్కువగా దీక్షలు తీసుకునే వారు. కానీ, కొన్ని సంవత్సరాలుగా మహిళలు, యువతులు కూడా దీక్ష తీసుకుంటున్నారు. నవరాత్రుల్లో ఎంతో నిష్ఠగా అమ్మవారిని పూజిస్తారు. మహిళల్లో రుతుక్రమం ఉన్న వారు 11, 21 రోజులు దీక్ష, రుతుక్రమం లేని వారు 41 రోజులు దీక్ష పాటిస్తారు. అమ్మవారిని పూజిస్తే కోరుకున్న కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. దీంతో ఈ సంవత్సరం అమ్మవారి దీక్ష తీసుకున్న వారి సంఖ్య భారీగా పెరిగింది.



చిలుకూరులో దుర్గామాతకు పూజలు చేస్తున్న భవానీ మాలధారులు

కోరుకున్న కోరికలు నెరవేరుతాయి



నాలుగు సంవత్సరాలుగా ఏటా విజయదశమికి భవానీ అమ్మవారి దీక్ష పాటిస్తున్నాను. మొదటి సారి దీక్ష తీసుకున్న వెంటనే ఉద్యోగం వచ్చింది. రెండు సంవత్సరాలకు సొంత ఇల్లు నిర్మించుకున్నాను.

– కరిష్మా, నల్లగొండ

మొదటిసారి దీక్ష పాటిస్తున్నా



మొదటిసారి భవానీ అమ్మవారి దీక్ష తీసుకున్నా. కొన్ని రోజులుగా అమ్మవారు కలలోకి వస్తున్నారు. ఇంట్లో సమస్యలో ఇబ్బందులు పడుతున్నాం. అమ్మవారి దీక్ష చేస్తే మంచి జరుగుతుందని దీక్ష తీసుకున్నాను.

– మహతి, నల్లగొండ

మానసిక ప్రశాంతత కలుగుతుంది



నాకు 15 ఏళ్ల వయస్సు నుంచే భవాని మాత అంటే ఎంతో భక్తి. వివాహమైన తర్వాత నాలుగోసారి అమ్మవారి మాల ధరించాను. ఈ మాలధరణ తర్వాత చాలా ప్రశాంత ఉంది. మంచి గౌరవం కూడా లభిస్తుంది. ఈ తొమ్మిది రోజుల పాటు నేను ఎంతో నిష్ఠగా ఉంటాను.

– నల్లమేకల లలిత, బాధలాపురం, మిర్యాలగూడ

నవరాత్రి రోజే నా పుట్టిన రోజు



శరన్నవరాత్రులు ప్రారంభమైన రోజునే నా పుట్టిన రోజు. నాకు చిన్నప్పటి నుంచే అమ్మవారు అంటే ఎంతో ఇష్టం. అందుకే మాలధరణ తీసుకుంటున్నాను. ప్రతి శుక్రవారం కూడా అమ్మవారిని పూజిస్తాను. ఈ మాల వేయడం వల్ల మానసిక ప్రశాంతత ఉంటుంది.

– భువనేశ్వరి, రెడ్డికాలనీ, మిర్యాలగూడ



బుద్ధవనాన్ని సందర్శించిన బౌద్ధుల బృందం



మహాస్తూపంలోని అష్టబుద్ధుల వద్ద అశోక అంబేద్కర్ దమ్మయాత్ర బౌద్ధుల బృందం

నాగార్జునసాగర్: అశోక అంబేద్కర్ దమ్మయాత్ర బౌద్ధుల బృందం శనివారం బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ బృందం యాత్ర కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం నుంచి బయలుదేరింది. ప్రపంచశాంతి, ప్రపంచ బంధుత్వం నినాదంతో ఈ యాత్ర కొనసాగుతోంది. ఈ బృందానికి బుద్ధవనం వద్ద తెలంగాణ రాష్ట్రం తరపున పూజ్య బిక్కు సద్ధారక్కిత సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా వీరు బుద్ధుని పాదుకల వద్ద పూజలు చేశారు. అనంతరం మహాస్తూపంలోని బుద్ధ భగవానుని బండాగారాన్ని, శ్రీలంక దేశీయులు ఏర్పాటు చేసిన ఆచార్య అవకాన బుద్ధుని నిలువెత్తు విగ్రహాన్ని, బుద్ధవనంలో ఏర్పాటు చేసిన పలుదేశాల బౌద్ధ స్తూపాలను, జాతక పార్కు, తపోవనం పార్కు తదితర ప్రాంతాలను సందర్శించారు. సందర్శించిన వారిలో నేషనల్ బుద్ధిష్ట్ మౌర్య బౌద్ధబిక్కు, దమ్మ కమిటీ సభ్యులు దమ్మా ధర్మేంద్రన్, ఉపాసకులు రాజేంద్రన్, కేరళ రాజగోపాలన్ ఉన్నారు.

టెక్సాస్‌లో బతుకమ్మ సంబరాలు



హుజూర్‌నగర్ : అమెరికాలోని టెక్సాస్ రాష్ట్ర రాజధాని ఆస్టిన్ సిటీలోని రౌండ్‌రాక్ ఏరియాలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మహిళలు తెలంగాణ పూలపండుగ బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. రౌండ్‌రాక్ ఏరియాలో నివాసముంటున్న హుజూర్‌నగర్, నల్లగొండ, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన మహిళలు కడియం పావని, కడియం ఆరాధ్య, అనిత, వీణ, సౌజన్య, శ్వేత, కావ్య, మమత, తేజ, గౌతమి, కల్పన, స్వప్న, అనురాధ, హేమ తదితరులు బతుకమ్మలను పేర్చి సాంప్రదాయబద్ధంగా పూజలు చేసి ఆడిపాడారు. కాలనీలోని నీటి తొట్లలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.